స్కెచ్

# సాక్షాత్తూ అగస్త్యుడి తమ్ముడు

రంధి సోమరాజు

మా మాలోకం ఇంకా ఆఫీసుకు దయచేయలేదు. వాడికి త్రోవలో అర్థంకాని ఏ విచిత్రం అడ్డమయిందో! ఎప్పుడూ అర గంట లేటు. మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ తగలబడతాడెప్పుడో! పోనీ వచ్చిన తరువాత వాణ్ణి తిట్టడానికైనా నోరురాదు కదా! వెధవ జాలికళ్లూ వాడూనూ! అమాయకంగా నిలబడతాడు గుమ్మం దగ్గర, లేకపోతే తల వంచేసి ఏదో ఒకటి చేయాలని అటూఇటూ చూస్తాడు; ఏముంటుందనో చెయ్యడాని కక్కడ? వాణ్ణి ఏమి చెయ్యడానికీ చేతులురావు. పోనీ ఇది వాడు గ్రహిస్తాడా అంటే అది వాడి కర్థంకాని సమస్య. ఆలస్యంగా వచ్చావేం అంటే మాట్లాడడు. గట్టిగా అడిగితే అసలు నోరు మెదపడు. మెల్లగా స్నేహంగా అడిగితే, అదో మాదిరిగా మొహంపెట్టి చేతులు నలుపుకుంటూ పారపోయిన కంఠంతో "ఆలస్యం అయిందండీ" అంటూ డోచేత్తో కుత్తుక సవరించుకుంటూ. ఇలాంటి సమాధానం వచ్చినప్పుడు నిజంగా మంటెత్తుతుంది. కాని ఏం చేస్తాం? "ఊఁ తగలబడు" అంటూ పీకలమీద కూర్చున్న పను లేవో అప్పజెప్పడం జరుగుతుంది.

ఫలాని టైముకు రావాలన్నప్పుడు ఆ టైముకు వస్తే అదో అందం. కాని వాడికి మాత్రం ఎప్పుడూ ఆలస్యంగా రావడమంటేనే ఆనందమో ఏమో! అదేమిటో వెధవ జవాబులు ఉత్త పనికి మాలినవి చెప్తాడు. ఓ రోజున ఆలస్యంగా వచ్చావేం—అంటే ఆ జేదో ఆలశ్యానికి పెద్ద అవసరమైన కారణమైనట్టు "మా అక్కాయి కూతురు ఎత్తుకోమని మారాము చేసిందండీ!" అన్నాడు. మరోసారి "మా పక్కింటావు ఎంచక్కని దూడ వేసిందనుకున్నారు!" అన్నాడు. ఇవిట, వాడు ఆలస్యంగా రావడానికి కారణాలు! ఇలాంటి పిచ్చి కారణాలకు నాకెంత కోపంవచ్చినా, వెను వెంటనే నాలో వాడి నిజాయితీకీ, అమాయకత్వానికీ ఏమీ చెయ్యలేని అశక్తత ఏర్పడుతుంది. వాడికసలు ఏమాత్రమూ లోకజ్ఞానం లేదు. బుర్రనసలు ఉపయోగించాలనే యోచించడు. దానికి పని చెప్పడం వాడికి కించిత్తూ ఇష్టంలేని పని. ఓ రోజున బీరకాయలు తెచ్చాడు, వాటిని మా ఆవిడ పెంటమీదకు గిరాటేసింది. నేను వాడిమీద కస్సుమనకుండా ఉండలేకపోయాను. అప్పుడు వాడుచెప్పిన జవాబు తెలుసుకోవలసిందే. "ఏటండి ప్రతిదానికీ అలాఅంటారు. నేను ఏరేరి పెద్దవి, నున్నగా చక్కగా ఉన్నవి తెస్తే మీకు నచ్చనేలేదు. ఆకొట్టు అబ్బి మొదట తూచబోయినవే తేవలసింది. మీకని వాడు మంచివి వేస్తున్నానని పైపెచ్చు అబద్ధాలు కూడా వాగాడు. మీకసలు ఆవిరిచేస్తే విరిగిపోయేవే తేవలసింది. చివరికాకొట్టువాడేమన్నాడో తెలుసా అండి - నీవు ఏరినలాంటివి ఎవ్వరూ ఏరలేక పోయార్రా— అన్నాడండీ" అన్నాడు గొప్పగా. ఇట్లాంటి వాడితో ఎట్లా సరిపుచ్చుకోవాలో నిజంగా మతిపోతూంది. వాడికి పాపం గోంగూరకూ తోటకూరకూ తేడా తెలియనే తెలియదు. గోంగూరను చూసి తోటకూర అంటాడు. అదేమిటట్లా అంటావంటే, "మీకు ప్రతీదానికీ ఎటకారమే. ఇది తోటకూర కాదా అండి మరి!" అంటాడు మూర్ఖంగా. "కాఫీ హోటలుకెళ్ళి..." అని మనం ఇంకా ఏవేవి తేవాలో చెప్పకుండానే గబగబా హోటలుకు వెళ్ళడానికి పరుగెట్టబోతాడు. అదేమిటి ఫుల్లయ్యా అంటే ఓ వెకిలి నవ్వు నవ్వుతాడు.

పాపం వాడికి పనిచెప్పిన వెంటనే చేసెయ్యాలనే ఆత్రుతేకాని ఆ చెప్పిందాంట్లో అసలు చెయ్యవలసిందేమైనా ఉందా లేదా అనే కాస్త ఆలోచనైనా లేదు. ఓసారి పోస్టాఫీసుకు వెళ్ళి పదిరూపాయిల అణా బిళ్ళలు తీసుకరమ్మని ప్రొద్దుట పది గంటలకు పంపితే మూడు గంటలకు వచ్చాడు. "ఇప్పటి వరకు ఏంచేస్తున్నావ్" అంటే, "ఆ పోస్టాఫీసువాళ్లు రెండుగంటల కిస్తా

మన్నారండి" అని జవాబు. "అరే, రెండుగంటల కిస్తామంటే అప్పుడే వెళ్ళి తెచ్చుకోవచ్చుగా. ప్రొద్దుటినుంచి ఇప్పటిఘరకూ అక్కడెందుకూ ఏడ్వడం?" అంటే, "బిళ్ళలు తేకుండావస్తే మీరు దెబ్బలాడుతారని ఉండిపోయానండీ" అన్నాడు. వాడికి నిజానికి ఇంగితజ్ఞానం ఏమాత్రం ఉన్నా ఇట్లాంటి పనులు చేస్తాడని కలలో కూడా ఊహించలేము, ఇలాంటి మాలోకం కుర్రాడు మా ప్యూను. అడుగో వస్తున్నాడు. ఆంజనేయులు బొట్టు మొఖం నిండా పులుముకొని చేతబడి పెట్టేవాడిలా వస్తున్నాడు. కాకీ నిక్కరూ చారల చొక్కా, చెల్లాచెదురైన జుత్తూ వాడూను. చూస్తేనే భయం వేస్తూంది. మాటలు చేష్టలు చూస్తే "ఛీఛీ" అన బుద్ధేస్తుంది. ఆబొట్టేమిటి మొఖంనిండా అలా అలుక్కున్నట్టు పెట్టుకుంటావంటే జవాబు ప్రక్క త్రోవను పట్టిస్తూ, "అది పెట్టుకోకపోతే నేనీపాటికి చచ్చేవాణ్ణేనండి. నన్ను పీక్క తినెయ్యడానికి దెయ్యాలెప్పుడూ సిద్ధంగా ఉంటాయండి." అంటూ, వాడికి దెయ్యాలతోపడే కీచులాటలు, కుత్తుక బిగిసిపోయి, ఊపిరి సలపక గింజుకోవటాలు, గుండెలు బరువెక్కిపోగా ఆ నాటితో ఇక సరే అనుకోవడాలు, ఎవర్ని పిలవటానికీ నోరు పెగలక మూలగడాలు ఇత్యాదులు వర్ణించుకు పోతాడు.

ఇక ఈ వెధవ నిప్పుడు, ఆలస్యంగా హాజరైనందుకు కారణాలడిగి ఉన్న కాస్త టైమూ పాడు చేసుకోవడంకన్నా—వాడికి పని పురమాయించి నాపని నేను చేసుకోవడం మంచిదనిపిస్తూంది. మనస్సులో మాత్రం కోపం పూర్తిగా నిండిఉండడంవల్ల, "ఏయ్ చవటన్నర చవటా" అని పళ్ళు పటపటలాడించి, "త్వరగా ఇంటికి తగలబడి, ఆవిడగార్ని పవరుపేట స్టేషనుకు తీసుకెళ్ళి ఈ డబ్బుతో గోదావరి స్టేషనుకు టిక్కెట్టు కొని ఇయ్యి. అనవసరంగా ప్లాటుఫారం టిక్కెట్టుకు బేడ పాడుచేయకుండా ఏలూరు స్టేషనుకు ఈ అణా పెట్టి నువ్వు టిక్కెట్టు కొనుక్కొని, బండి ఎక్కించి వెంటనే వచ్చేసెయ్. ఇవాళ శనివారం బ్యాంకు పండ్రెండుగంటలకే కట్టేస్తారు తెలుసా? ఆలస్యం చేశావంటే చర్మం వొలుస్తాను" అంటూ నా ఎదుటనుంచి పొమ్మన్నాను.

వాడదే పోతగా పోయాడు. నేను నాపనిలో మునిగిపోయానన్న మాటేగాని, నా మనసంతా వాడిమీదే ఉంది. ఎవరో వస్తున్నారు; పోతున్నారు. నే నేదో చెప్తున్నాను. మరేదో వింటున్నాను. డబ్బు పుచ్చుకోవడం, ఇవ్వవలసింది ఇవ్వడం అంతా మెషీన్‌లా జరిగిపోతూంది. ఇంతలో గుండెలు జలదరించేటు "భుయ్" మని రైలుకూత, నామనసులోని కల్లోలానికి ఊత చెవుల్లో చొరబడింది. గుండెలపై నిలబడింది. కళ్ళు గడియారాన్ని కౌగలించుకున్నాయి. అబ్బ! నే ననుకోలేదు. బండి ఇంత సరియైన వేళకు వస్తుందని; అది లేటవుతుందేమోనని భయపడ్డాను. కాని ఆ కూత, నాలోని కల్లోలానికి మూత వేసింది. ఇక వాడు త్వరగా రావాలి. వాడికి మధ్యలో సమస్యలు రారాదు. ఈ లోగా మా బ్యాంకు టైము పరారి కారాదు. ఈపాటికి వంతెనదగ్గరకు వచ్చేసే ఉండాలి. గండాలేవీ మొండిగా వాడి కడ్డురాకుండాఉంటే ఆ సినిమా దగ్గరకు వచ్చేస్తాడు. ఇంతలో ఏదోపని; ఏదో వ్రాస్తున్నాను. మళ్ళీ కళ్ళు గడియారాన్ని ముద్దెట్టుకున్నాయి. ముద్దుకు దూరంగా పరుగెత్తాయి ముళ్ళు. రోడ్డుమీద మా చవటని వెతకటానికి ప్రణయాన్ని విడచి ప్రయాణంచేశాయి కళ్ళు. ఏడీవాడు? ఇంకా రాలేదేమిటి? వాడీపాటికి బ్యాంకులో తప్పక ఉండాలే. ఈ మొద్దు, ఇంకా అవతరించడేం? అసలు వీడు తిన్నగా ఇంటికి వెళ్ళాడా? మధ్య త్రోవలో చక్కర కొడుతున్నాడా? ఏమిటో అర్థం కావడంలేదు.

కాస్సేపు ఈ విషయంమీద నాబుర్ర పని చేయడం మానేసి—మళ్ళీ అందుకుంది. లేకపోతే బండి అందలేదా? అందకపోవడమేమిటీ ఖర్మం బోలెడువేళ ఉందనగానే వీడ్ని ఇంటికి తరిమానే. నిజానికి ఈఆడవాళ్ళకు ఎంతటైమున్నా చాలదు. విప్పిందే విప్పటం, కట్టిందే కట్టడం. వాళ్ళుచేసే ఆలస్యానికి ఓ అర్థం పర్థం ఉండదు. రెండు రోజుల ప్రయాణానికైనా బండెడు బట్టలు భోషాణంలాంటి పెట్టెలో తెగసర్దటం; ఇక బిందెడు నీళ్ళతో మొఖంరుద్దటం. బొట్టు పెట్టుకొనేటప్పటికి, దాని వంకర్లు దిద్దుకొనేటప్పటికి బొట్టులోని అర్థాన్ని నాశనం చెయ్యడానికే పూనుకొంటారో ఏమో—మనం చస్తాం. ఇక

చూసుకున్న మొహాన్నే అద్దంలో మరోసారి సరిచూసుకోవడం, వేసుకున్న వేషాన్ని ఇంకో సారి పరిశీలించుకోవటం జరిగి అంతా ఆల్ రైట్ గానే ఉందని బుజువైన అనంతరం బయటకు కాళ్లు పెటడమనేది జరిగితే హమ్మయ్యా, చచ్చిన వాళ్ళకు ప్రాణాలొస్తాయి. ఎలాగైనా ఈ కలి యుగపు స్త్రీలు సాక్షాత్తు పార్వతీదేవి అపరావతారాలు! మరి అంతటితో బయలుదేరితే నయమే! పక్కింటివాళ్ళతో మరీమరీ చెప్పి, ముసిముసి నవ్వులు విసిరి, చీర నలగకుండా శరీరానికి ఊరి పోస్తూ బండివెక్కేటప్పటికి, రైలుబండి ఉంటే ఉంటుంది, ఉడాయిస్తే ఉడాయిస్తుంది.

ఇలాంటి ఆలస్యాలు జరుగుతాయనే వాడిని బండికి చాలా టైముందనగా పంపాను. అసలు కొంపతీసి బండి అందకపోతే అక్కడే వీళ్లు తిష్ఠ వేయలేదుకదా? రానుపోను రిక్షా డబ్బులు అనవసరంగా క్షవరం అవుతాయని మా ఆవిడ, బండి ఎక్కించితీరాలని వీడు—సాయంకాలం బండి వచ్చేవరకు అక్కడే ఉండాలని నిర్ణయించుకున్నారా ఏమిటి? ఈ తమ్మయ్యాలు నిజానికి ఇలా చేసేరకం కూడాను! అప్పుడే పన్నెండు దగ్గర పడుతూంది. బ్యాంకు కట్టేసేవేళ ఆసన్నమౌతూంది. ఇక కొట్టు, ఈ ఆఫీసుదుకాణం-మూసేసి నేనే వెళ్ళాలా? ఇంతపనీ ఇక చేయక తప్పదా ఏమిటీ? బేరాలవేళప్పుడు కొట్టు కట్టేయడం ఏం బాగుంటుంది? ఇది నిజంగా నగుబాటుకదూ! బలే గొడవ తెచ్చిపెట్టాడే. తప్పనిసరిగా శనివారానికి ఉన్న నిల్వ అంతా బ్యాంకులో కట్టకపోతే ఈసారి తప్పకుండా పైనుంచి అదోరకం ఉత్తరాలు అవతరిస్తాయి. వాటికి సంజాయిషీ చెప్పుకోలేక చావాలి. ఇంతకన్నా కొట్టుమూసేసి, ఆ బ్యాంకుపనేదో నేనేచూస్తేనే బాగుంటుంది. ఇంతకీ ఈ వెధవవల్ల ఎంత చావు వచ్చింది. అసలు వీడు ఎక్కించేసే ఉంటాడు. కాని అణా డబ్బులకోసం కక్కుర్తిపడి ఏలూరుకు టిక్కెట్టు తీసుకోకుండానే, ప్లాటుఫారం మీద ఉండి తరువాత బయటికి వొచ్చేటప్పుడు టిక్కెటు కలెక్టరుకు పట్టుబడి ఉంటాడు. అంచేత ఇక చచ్చినట్టు కొటు కట్టేయవలసిందే! రానియ్— చెప్తావీడిని, ఒక్కపనీ తిన్నగా తగలెట్టడుగదా. వీడిని నలువునా చీరినా పాపంలేదు. ఈసారి గూబ గుయ్‌మనిపిస్తేగాని తెలివి రాదు. ఇలా అనుకోవడమే గాని, వాడిని ఎప్పుడైనా ఏమైనా చేసి ఏడిస్తేగా! ఏమిటో వాడ్ని ఇట్లా చేసెయ్యాలి అట్లా చేసెయ్యాలి అన్న ఊహాలతో సంతృప్తి పడటంతప్ప మరేమీలేదు. వాడు చేసే అవకతవకలవల్ల కలిగే బాధకు, ఈ ఊహాలు చక్కని మందుగా మాత్రం పనిచేస్తున్నాయి. అంతే!

అప్పటికే పది నిముషాలు తక్కువ పన్నెండయింది. ఇక బ్యాంకు దగ్గరకు చేరేటప్పటికి ఆ కాస్త టైమూ ఎలాగూ అయిపోతుంది. ఆ కాషియర్‌ను బ్రతిమాలి ఎలాగో ఈ తడవకు పుచ్చుకోమని చెప్పాలి, అనుకుంటూ కొట్టు మూసేస్తున్నా. ఇంతలో మా చవట కాళ్ళీడ్చుకుంటూ పీడమొహంవేసుకుని తయారయ్యాడు. వాడిని చూడగానే నాకు ఎంతకోపం రావాలో అంతా నా మొహంలోనికి రైలింజను పొగలా క్రమ్ముకొచ్చింది. పళ్లుబిగపెట్టి,ముక్కుసూదిగాచెక్కి, కళ్ళల్లోనికి బాగా కోపాన్ని కుక్కి కంఠాన్ని కఠోరంగా నొక్కి "ఎక్కడ ఘోరిస్తున్నావిప్పటి దాకా" అన్నా. దానికి వాడు తను చేసిందేదో పెద్ద ఘనకార్యంలా "మరి పెద్ద స్టేషనునుంచి నడచి రావాలా అండి" అన్నాడు. ఈ మాటకు నా కళ్ళు ఎరుపెక్కిపోయి ఉంటాయనుకుంటా! ఒక్కసారిగా, "అక్కడకు చావవలసిన అవసరం ఏం వచ్చింది" అన్నా ప్రక్కనున్న గోడలన్నీ అదిరి ఊడిపడేటు. అయితే దానికి వాడు జవాబేమిచ్చాడు?

"ఏలూరుకు టిక్కెట్టు కొన్నాను కదాండి. మరి అక్కడకు వెళ్ళకపోతే ఎలాగండీ!" అన్నాడమాయకంగా. దీనితో నా తల తిరిగిపోయింది. ఇంత చవటా స్క్వేర్, ఫస్టుక్లాసు పరమానందయ్య శిష్యుడు ఎక్కడైనా ఉంటాడా? ఏదో కథల్లో ఉంటారని అనుకుంటాంగాని! అయినా నా ప్రాణాలు విసిగించి తీసెయ్యడానికి, ఆ కథల్లోంచే అవతరించాడేమో, ఈ చవటావతారం నిజానికి, నా పాలిట మృత్యువులా దాపరించాడు.